# తేడా

ఒకనాడు స్వామీ వివేకానంద మద్రాసులో వున్న లాకాలేజీ హాస్టెల్సుకి—ఏదో సందర్భంలో-వెళ్ళారట. మాటలమధ్యలో అక్కడవున్న శ్రీకృష్ణుడి నిలువెత్తు విగ్రహాన్ని చూపించి, "అంత నీలంగా వేయడంలో అర్థమేమయినా వుందా? అంతరార్థమేమయినా వుందా?" అని అడిగారట.

అప్పుడు ఎవరికి తోచినట్టు వారు చెప్పారట. అక్కడ వున్న ఓ పందొమ్మిదేళ్ళ యువకుడు ఇలా అన్నాడట:

"సముద్రాన్ని చూడండి. ఆకాశాన్ని చూడండి. నీలి కడలి అనంతం. వినీలాకాశం అనంతం.అలానే నేనూ అనంతం. అదే ఆ లీలా మానుష వేషధారి అనంతమైన వాడని చెప్పడానిగ్గానూ నీలంరంగు వాడబడింది."

వెంటనే స్వామీ వివేకానంద ఆ యువకుణ్ణి కౌగలించుకుని "నువ్ చాలా గొప్పవాడి వౌతావ్." అన్నారట బహుశా ఆనందబాష్పాలు రాలుస్తూ.

ఆ యువకుడే రాజాజీ!

"సరిగ్గా ఇలాగే జరిగిందనను గాని సుమారుగా ఇలానే జరిగింది" అన్నారు మాష్టారు.

నిజమే కావొచ్చు మాష్టారూ కాని-శరీరం పూర్తిగా నీలంరంగు అయిపోవడమంటే చాలా డీపెన్డ్‌సయనోసిస్. అంటే ఏదో ఒక వ్యాధి చిహ్నం వుదాహరణకి గుండెవ్యాధి అందాం. వ్యాధి అంటే లోపం గుండెవ్యాధి అంటే శ్రీకృష్ణుడి హృదయంలో కూడా లోపాలున్నాయన్న మాట.అంటే అతడు పరిపూర్ణంగా స్వచ్ఛమైనవాడు కాడన్నమాట." అన్నాను.

"ఛీ నోర్మూయ్—" మాష్టారు.

" అది రాజాజీ ఇంటర్‌ప్రిటేషన్. ఇది నా ఇంటర్‌ప్రిటేషన్. వివేకానందస్వామి అతని ఇంటర్‌ప్రిట్ చేసే శక్తిని మెచ్చుకున్నారు గాని ఇంటర్‌ప్రిట్ చేసినదాన్ని కాదు."

"రాజాజీ గొప్పవాడు కాబట్టీ గొప్ప విషయాన్ని ఇంటర్‌ప్రిట్ చేశాడు. ఆధ్యాత్మిక భావాన్ని సూచించాడు. నువ్వు సామాన్యుడివి. అందులోనూ శుద్ధ అర్థి నెరీ గాడివి. దేవుడిలో సైతం లోపాలు తప్పచూడలేదు నీ కన్ను. నా స్త్రికుడా! అదీ తేడా"—మాష్టారు.

"నిజమే మాష్టారూ. రాజాజీ స్వామీ వివేకానంద అంత మహోన్నత వ్యక్తి ముందు ఇంటర్‌ప్రిట్ చేశాడు. నేను మీ అంత గొప్ప వ్యక్తి ముందు—చేశాను. అదీ తేడా"—నేను.

—మెడికో శ్యామ్